# బలి

కే. బాస్కర్రావ్ పట్నాయక్

మత ద్వేషాగ్ని జ్వాలలు దట్టంగా అలుము కుంటున్న రోజులవి... పేదా, ధనిక విచక్షణ లేకుండా, – స్త్రీ పురుషులనే భేదం లేకుండా, పసి పిల్లల సహితం అనవసరంగా అన్యాయంగా, నిర్దాక్షిణ్యంగా ఆ జ్వాలలకు ఆహుతి అయిపోతుండే రోజులవి...

వందలకు వందలు గృహాలు దగ్ధమై పోతున్నై... ఒకరిపై ఒకరికి విశ్వాసం ఏమాత్రం లేదు. మానవ జాతి నీచాతి నీచంగా, పశు ప్రాయంగా సంచరించే రోజులవి...

ప్రజలు భీతావహులై గ్రామాలకు గ్రామాలు దాటి, తమ ఆస్తిపాస్తులను విడిచి పెట్టి వెళ్ళి పోతున్నారు.

దుండగీండ్ల రాక్షస కృత్యాలు మితి మీరి పోతున్నై ఎన్నడూ ఎరుగని అమాయక బానిస జనం యొక్క రక్త ప్రవాహం వెల్లువలై పారుతోంది.

నిష్కళంక దేశ భక్తుడు, అశేష త్యాగమూర్తి అయిన రామనారాయణ్ ఇల్లు ఒక రాత్రి తగుల బెట్టబడింది. మత ద్వేషాగ్ని తీవ్రంగా వ్యాపించి వున్న పరిస్థితిలో అతను ఆరాత్రికి రాత్రి కట్టు బట్టలతో తన భార్యను, పదేళ్ళ కొడుకుని, రెండేండ్ల బిడ్డతో సహా ఆ వూరు విడిచిపెట్టి వెళ్ళి పోతున్నాడు.

చాల దూరాన అతని గృహం దగ్ధమై పోతోంది. ఆవెలుగులో తను నడచి పోతు న్నాడు.

"మనకెంత అవస్థ వచ్చింది?"

అంది భార్య చంటి పిల్లడ్ని ఎత్తుకొని నడుస్తూ.

"ఏం చేస్తాం, అయినా నువ్వు అధైర్య పడకు" అని హెచ్చరించాడు.

"మన ఇల్లు ఎందుకు కాల్చేస్తున్నారు బాబాయి?" అన్నాడు తన పదేండ్ల కొడుకు తనతో బాటు నడుస్తూ.

దీనికి ఏంసమాధానం చెప్పాలో రామ నారాయణ్ కి తోచింది కాదు.

"నీకు తెలియదు అబ్బాయ్! నువు పెద్దవాడివయింతరవాత నీకు అంతా బోధ పడుతుందిలే!" అన్నాడు ఏదో అవకతవకగా సమాధానం చెప్తూ

"మనం ఇప్పుడు ఎక్కడికివెల్తున్నాం"

అన్నాడు మళ్ళీ కొడుకు–

దీనికి సులువుగా–

"మన స్నేహితుల ఇంటికి."

అన్నాడు రామనారాయణ్.

ఇలా మాట్లాడుకొని వెళ్లి పోతుండగా పొదల్లోంచి పదిమంది జనం వచ్చి చుట్టూ మూగారు.

"కెవ్వు" మని కేకేసింది రామనారాయణ్ భార్య. "కార్" మంది ఆమె చేతి లో బిడ్డ!

అటు వైపు చూడకముందే రామనారాయణ్ బంధితుడయ్యాడు.

చంటి పిల్లాడు వక్కావక్కలయ్యాడు తళుక్కుమని మెరసే ఒక రాక్షసుని ఖడ్గంతో.

తన పదేండ్ల కుర్రాడు కూడా అదే మాదిరి భీకరకృత్యానికి ఆహుతి అయ్యాడు.

రామనారాయణ్ కళ్ళ మంట అశ్రుధారలు జలజలా రాలి పోతున్నై.

తన కళ్ళ ముందే తన సంతానం——?

ఎంత ఘోరం!...

అందరిని చంపేద్దామన్నంత ఆవేశం, కోపం కలిగింది. కాని, తాను బంధితుడు; అశక్తుడు!

ఎంత భయానక దృశ్యం? అతని హృదయం దహించుకు పోయింది. ముఖం ఎర్రబారింది. ఒళ్ళంతా చెమటలు పోశాయి అతని కళ్ళయందు ప్రళయ దేవత విలయ తాండవం చేస్తూ వికటాట్ట హాసం చేసింది!

రామనారాయణ్ భార్య కొయ్యబారి పోయింది. ఆమెలో చైతన్యం మరిలేదు. కాని ఆమె మరి ఈ లోకంలో వుంటేగా! నిస్తేజమైన ఆ కళేబరాన్ని ముళ్ళ డొంకలోకి ఈడ్చుకొని పోయారు రామనారాయణ్ చూస్తుండగా...

ఇదంతా వీక్షిస్తూవున్న రామనారాయణ్ హృదయం ముక్కలై పోయింది. ప్రపంచం గిర్రున తిరిగి పోతోంది. ఎన్నో భూకంపాలు ఒక్కసారి వచ్చినట్టయింది. ప్రపంచమంతా దద్దరిల్లి పోయినట్టయింది.

నాభార్య, నాసంపద, నాపిల్లలు, అంతా శూన్యం. నేనిప్పుడు ఏకాకిని. మీరు సంతోషించండి. ఇంతటిలో మీ మత ద్వేషాగ్ని చల్లారిందా? లేదు, మీకు, నాకు శాంతి లేదు. మీకు ధర్మం, న్యాయం విచక్షణ లేదు; సోదర ప్రేమ ఏకోశానా లేదు; భయం, భీతి లేదు! మీ మత మౌఢ్యమే మిమ్మల్నింత అధోస్థితికి తెచ్చింది. మిమ్ములను చూస్తుంటే నాకు జాలేస్తోంది. మీ మత గ్రంథాల్లో ఇలాంటి కృత్యాలు చేయమని శాసిస్తోందా? ఇందుకు మీరు బాధ్యులు కారు. మిమ్ముల్ని ప్రోత్సహిస్తూన్న మీ నాయకులే! మీరు, మేము అంతా అన్నదమ్ములవలె ఇంతవరకు మెసలినాము. కాని, మీ హృదయాలు ఎంతలో పరివర్తనం చెందాయి! కరకు కసాయివాని కత్తికి జాలి, భయం, ధర్మం వుంటుంది. ఆ కసాయి వాని హృదయంలో నిజంగా మీరు అమృతం చూడగలుగుతారు. ఎందుచేత! అతను చేస్తున్నది బుద్ధి పూర్వకంగా కాదు: కుల వృత్తి కారణంగా! మీరో? మతోన్మాదులు! ఒకరిపై ఒకరికి విశ్వాసం సడలి పోయింది. మత విద్వేషాగ్ని జ్వాలలను మీరు రగిల్చారు. అమాయక సోదర ప్రజల మానప్రాణ ధనాల్ని దోచుకొన్నారు. అనేక శవాల దొంతరలు రాసులుగా కూలిపోతున్నై. మీ సోదరుల రక్తం వరదవలె

ప్రవహిస్తోంది. ఎన్నెన్ని గృహాలు మీచేతులారా దగ్ధమై పోతూన్నాయి? ఎన్ని కుటుంబాల్ని నాశనం చేశారు? ఇదేనా మతోన్మాదం దీనివల్ల మీరు పొందగలిగే అభ్యున్నతి? ఏమీ లేదు–అంధకారం! మీరంతా పిరికి పందలు, దుర్మార్గులు, రాక్షసులు. నా యెదుట నాపిల్లల్ని చంపారు. నాభార్య మాన, ప్రాణాల్ని హరించారు, నాగృహాల్ని తగుల పెట్టారు నన్నెందుకు మరి విడిచి పెట్టారు? మీధైర్యం సన్నగిల్లిందా? ఇది శ్రేయమని, న్యాయమని, అక్రమమని మీ మనస్సు ఘోషించడం లేదూ? మీ అంతరాత్మ ప్రబోధించడం లేదు! ఇంతమంది వీర శిఖామణుల కరకుకత్తులమీదే నాప్రాణాల్ని పోనివ్వాలి. ఇక నన్ను నరకండి! హాయిగా భగవన్నామ స్మరణ చేసుకుంటూ ప్రాణాలు విడిచి పెడతాను. ఊ! కానివ్వండి! ఎవ్వరూ పూనుకోనరేం! నేను మీకు ప్రతీకారం చేయ గలిగిందల్లా ఇదే! నన్ను కూడా నరకండి! లేదా చిత్రవధ చేయండి అంటూ గుండె "ఠపీ" మని ఆగి పోయి నేలకు వరిగి పోయాడు రామనారాయణ్! అతని చుట్టు నున్న గూండాలంతా అప్రయత్నముగా ఒక్కసారి చేతులెత్తి "జోహార్" చేశారు!

తంతి: "ప్రభాత్"

# ప్రభాత్ హాండ్ లూమ్స్

చేమగ్గ బట్టలను తయారుచేయువారు

కరూర్ (ఎస్. ఐ. రైల్వే)

ఉత్తమతరగతికి చెందిన చేనేత తువాళ్లు, దుప్పట్లు, గృహావసర వస్త్రాలు, దుస్తుల పరికరాలు అందమైన ఆకర్షణీయమైన డిజైన్లతో ఉత్పత్తిచేయువారు.

*

రంగు, నేత, గ్యారంటీ.

వర్తక విషయాలకు వ్రాయండి

**PRABHAT HANDLOOMS — KARUR (S. I. R.)**